

# ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్య మంత్రి రూ.100 కోట్ల నిధులు మంజూరు
- ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌళిక వసతుల కల్పనకు క్షేత్రస్థాయిలో పర్యటన
- త్రాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- ఏదులాపురం మున్సిపాలిటీలో మార్నింగ్ వాక్ నిర్వహించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) ఆగస్టు: 7:** ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, సత్యనారాయణ పురం, ఇందిరమ్మ కాలనీలలో జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్‌తో కలిసి కాలి నడకన కాలనీల్లో తిరుగుతూ మంత్రి వర్యులు అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య పరిస్థితులు, ప్రజా మౌళిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను విలీనం చేసి ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపాలిటీని

మిగతా 2 లో...

# 14 క్వింటాల పీడీఎస్ బియ్యం పట్టివేత



**నేలకొండపల్లి, ఆగస్టు 7 ప్రజాజ్యోతి :** మండలం లోని ఆరెగూడెం లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం ను పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని ఆరెగూడెం గ్రామంలో సి. హెచ్.నాగేశ్వరరావు అనే వ్యక్తి నివాసంలో 14 క్వింటాల ప్రభుత్వ రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలంకు చేరుకుని వివరాలు సేకరించారు. ఇంటి యజమాని చెబుతున్న వివరాలకు పొంతన లేకపోవటంతో... అక్రమంగా పీడీఎస్ బియ్యం ను నివాసంలో నిల్వ చేసినందుకు ఇంటి యజమాని నాగేశ్వరరావు పై కేసు నమోదు చేశారు. బియ్యం ను స్వాధీనం చేసుకున్నారు. బియ్యం స్టాక్ చేసింది.. ఎవరూ.. ఇంటి యజమాని కి బియ్యం కు సంబంధం ఉందా... ఇతర వ్యాపారులు ఎవరైనా అక్కడ నిల్వ ఉంచారా.. ఇంకా ఎక్కడెక్కడ బియ్యం నిల్వలు ఉన్నాయి... అనే విషయం పై సివిల్ సప్లై...పోలీసు అధికారులు విచారణ చేపట్టారు.


జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఖమ్మం





శనివారం | 8 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 7




# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- పాలనలో రాజకీయాలకు తావులేదు
- ఆగస్టు 15 నుంచి ఆసరా పింఛన్లు
- తిరుమలాయపాలెంలో రూ. 7.00 కోట్ల పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

**ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) ఆగస్టు: 7:** తిరుమలాయపాలెం అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డిగూడెం నుంచి రాకాసితండా వరకు రూ. 2.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, రాజారాం నుంచి తుమ్మగూడెం వరకు రూ. 4.50 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే హైదర్ సాయిపేట, పాతర్లపాడు గ్రామాల్లో రూ. 20 లక్షల చొప్పున అంచనా వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ భవనాలకు భూమి పూజ నిర్వహించారు.

**సమగ్ర అభివృద్దే ధ్యేయం..**

ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమపాళ్లలో పరుగులు తీయిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. తిప్పారెడ్డిగూడెం అభివృద్ధికి ఇప్పటివరకు రూ. 35.55 కోట్లు, హైదర్ సాయిపేటకు రూ. 37 కోట్లు, పాతర్లపాడుకు రూ. 29.25 కోట్లు, రాజారాం గ్రామానికి రూ. 8.48 కోట్లు మంజూరు చేసి వివిధ

మిగతా 2 లో...

# సివిల్ సప్లై గోడౌన్ వద్ద ఆందోళన...!

- హమాలీలకు ప్రవేట్ వ్యక్తి కి పంచాయతీ
- గోడౌన్ వద్ద నీ పెత్తనం ఏమిటీ అంటూ నిలదీత
- తహశీల్దార్ ఆదేశాల మేరకు ఆర్.ఐ.విచారణ

2 లో...



# ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులకు భరోసా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పిడి విధానం పై దృష్టి పెట్టాలి
- వనమహోత్సవం, చేయూత పెన్షన్లు, యూనిఫాం కుట్టు పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులను నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, వ్యవసాయం, మండల ప్రజావాణి

మిగతా 2 లో...

# ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తాం





(మొదటి పేజీ తరువాయి...)

రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేశారని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌళిక వసతులను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకే క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నామని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో తుమ్మ చెట్లు పెరగడం, రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడం వంటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటి శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన డ్రైనేజీ నిర్మాణంతో పాటు ఇతర మౌళిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య ఉందని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, దానిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. విద్యుత్ తీగలకు సంబంధించిన సమస్యలను కూడా సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు. కొంతమంది ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల కోసం వినతులు అందజేశారని, వాటిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పార్కుల అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని, ఈ నెలాఖరులోగా వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి పనిని నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. సాయిగణేష్ నగర్ లో రోడ్డు వెంట ఉన్న టీ స్టాల్ లో కూర్చుని టీ త్రాగి అనంతరం ఇందిరమ్మకాలనీలో పర్యటించారు. వర్షం పడుతున్న కాలినడకన గొడుగు చేత పట్టుకుని తిరిగి పరిసరాలను పరిశీలిస్తూ కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. వెంకట్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లై గోడౌన్ వద్ద ఆందోళన...!



**నేలకొండపల్లి, జులై 7 ప్రజా జ్యోతి :** స్థానిక సివిల్ సప్లై మండల లెవల్ స్టాక్ పాయింట్ వద్ద శుక్రవారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పంచాయతీ వద్దకు ఆర్.ఐ. క్షేత్ర పరిశీలన చేసి... ప్రవేట్ వ్యక్తి రాకుండా చూస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో మండల లెవల్ స్టాక్ పాయింట్ వద్ద ఎటువంటి సంబంధం లేని శ్రీను అనే వ్యక్తి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హమాలీలకు పనులు అప్పగిస్తూ... పెత్తనం చెలాయిస్తుండటంతో హమాలీలు ఆందోళన కు దిగారు... గోడౌన్ నుంచి వెళ్లిపోవాలని నినాదాలు చేశారు. ఈ ఘర్షణ విషయం ను గౌడౌన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ గా పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగి వీడియో తీస్తుండటంతో వివాదం మరింత ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేక...గోడౌన్ ఇంచార్జీ లేకపోవటం వలన గోడౌన్ వద్ద నిత్యం వివాదాలు జరుగుతున్నాయి. ఈ ఇద్దరు వలన హమాలీలు ఇబ్బందులు పడుతున్నామని నిలదీశారు. దీంతో బియ్యం రేషన్ దుకాణాలకు ఎగుమతులు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో హమాలీల మధ్య పంచాయతీ జరిగింది. అరుపులు, కేకలతో గోడౌన్ వద్ద ఘర్షణ జరిగింది. విషయం తెలుసుకున్న నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ ఆదేశాల మేరకు మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు గౌడౌన్ వద్ద క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. హమాలీలతో చర్చించారు. ఈ సందర్భంగా హమాలీలు ప్రవేట్ వ్యక్తి తమ పై పెత్తనం చెలాయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ వలన తాము ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. ప్రవేట్ వ్యక్తి ని రాకుండా చూస్తామని...ఈ విషయం పై సివిల్ సప్లై జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామని హామీ ఇవ్వటంతో హమాలీలు ఆందోళన విరమించారు. బియ్యం ఎగుమతులు ప్రారంభించారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



(మొదటి పేజీ తరువాయి...)

అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. రైతాంగానికి మద్దతు ధరతో పాటు వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్, ఎకరాకు రూ. 6 వేల రైతు భరోసా జమ చేశామని గుర్తుచేశారు.

**ఇందిరమ్మ ఇళ్లు పారదర్శకం..**

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎవరికీ ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ప్రతి సోమవారం క్షేత్రస్థాయి ప్రగతి ఆధారంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే బిల్లులు జమ చేస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే రెండో విడత ప్రొసీడింగ్స్ అందజేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి నూతన ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిపిఓ వినోద్‌మార్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులకు భరోసా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



(మొదటి పేజీ తరువాయి...)

వనమహోత్సవం, రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతిని సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను క్షేత్ర స్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం తో పంట మార్పిడి విధానాల వల్ల రైతులు నష్టపోకుండా ఉంటారని, రైతులు ప్రత్యామ్నాయ సాగు విధానాలు పాటించేలా ప్రోత్సహించాలని తెలిపారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు చేపట్టిన పంట కుంటలు, బోర్ రీచార్జ్, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంచి వాతావరణంలో, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి చౌక ధరల దుకాణం పరిధిలో కార్డుల సంఖ్య, లబ్ధిదారుల వివరాలు, పంపిణీ తేదీ, సమయం, వేదిక, డీలర్ల వివరాలతో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి పంపిణీ కేంద్రానికి ఒక బాధ్యత గల అధికారిని ఇన్‌చార్జిగా నియ మించి, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. లబ్ధిదారుల సౌకర్యార్థం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికారులు, వైద్యాధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెన్షన్ దరఖాస్తుల స్వీకరణలో కూడా ప్రజలు ఒకేచోట అధిక సంఖ్యలో చేరకుండా గ్రామపంచాయతీ స్థాయిలో ప్రణాళికాబద్ధంగా దరఖాస్తులు స్వీకరించే విధానాన్ని అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సులభంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత వర్షపాత పరిస్థితులు, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, ఆయకట్టు సాగు, తాగునీటి అవసరాలపై కూడా సమగ్రంగా చర్చించారు. జిల్లాలోని మేజర్, మీడియం, మైనర్ చెరువుల నీటి నిల్వలపై పూర్తి సమాచారాన్ని సిద్ధం చేసి, అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గ్రామాలలోని చెరువుల్లో నీటిని తాగునీరు, పశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయంగా వినియోగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి నీటి వినియోగంపై ప్రజలకు స్పష్టమైన సందేశం అందించాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉన్న నీటి వివరాలు తెలిపేందుకు గ్రామీణ స్థాయిలో ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో పెద్ద ఎత్తున రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం చేయాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని, వ్యవసాయ శాఖ రైతులకు పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్వో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డిఆర్డీఏ శ్రీరాం, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మనోహర్, నీటి పారుదల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ దిశ హాస్పిటల్లో ఉచిత వైద్య శిబిరం

- ముఖ్య అతిథిలుగా మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య , డీసీసీబీ మాజీ చైర్మెన్ కురాకుల నాగభూషణం





**ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) ఆగస్టు: 7** ఖమ్మం : రిజర్వేషన్ల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శ్రీ దిశ హాస్పిటల్లో ఉచిత వైద్య శిబిరాని నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య , డీసీసీబీ మాజీ చైర్మెన్ కురాకుల నాగభూషణం లు పాల్గొన్నారు . బీపీ మండల్ కమిషన్ సిఫారసుల మేరకు1997 వీపీ సింగ్ ప్రధాన మంత్రి కేంద్ర ప్రభుత్వ విద్యా ఉద్యోగాల్లో మొదటి సారి బీసీ లకు రిజర్వేషన్లు 1997 ఆగస్టు 7 న ప్రవేశ పెట్టడం జరిగిందని అట్లాంటి స్పూర్తి దాయకమైన రోజు శ్రీ దిశ హాస్పిటల్స్ యాజమాన్యం వారు ఉచిత వైద్య మరియు ఫైబ్రో స్కాన్ మరియు బీఎండీ ఎముకల సాంద్రత తెలుసుకునే విలువైన పరీక్షలు నిర్వహించడం ప్రజలకు సామాన్యులకు ఎంతో అవసరమని సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య అన్నారు . ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యాన్ని వైద్యులను అభినందించారు . దిశ హాస్పిటల్ వారు ఏర్పాటు చేసిన ఉచిత పరీక్షల వైద్య శిబిరాన్ని పర్యవేక్షించి , బీపీ మండల్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు .డీసీసీబీ మాజీ చైర్మెన్ కురాకుల నాగభూషణం మాట్లాడుతూ బీసీ లకు రిజర్వేషన్లు సాధించిన రోజు ఇలాంటి ఉచిత వైద్యాన్ని ఏర్పాటు చేసి పేదలకు సహాయం అందిస్తున్న శ్రీ దిశ హాస్పిటల్ ను అభివృద్ధిలోకి తీసుక రావాలని అందరూ సహకరించాలని అన్నారు . ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంతరలోజిస్ట్ సి.కపిల్ తేజస్వి హైదరాబాద్ మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలు చాలా ఖరీదు కలిగినవి అని ఇలాంటి ఉచిత క్యాంప్ లో సామాన్య ప్రజలు ఉపయోగించుకోవాలి అని అన్నారు . రోజు రోజుకి మారుతున్న ఆహార అలవాట్లు వాటి ఫలితంగా లివర్ పేగులు జీర్ణ వ్యవస్థ చెడిపోవడం జరుగుతుందని అన్నారు . ప్రముఖ కీళ్లు ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్ కిరణ్ , డాక్టర్ క్రాంతి రనదేవ్ మాట్లాడుతూ ప్రజలు జాగ్రత్తగా ఉంటూ సాత్విక పౌష్టిక ఆహారం తినాలని శుభ్రమైన గాలి నీరు వాతరణం లో జీవించాలని అన్నారు . మేనేజ్మెంట్ మేకల సుగుణారావు మాట్లాడుతూ శ్రీ దిశ హాస్పిటల్ కార్పొరేట్ వైద్యాన్ని సామాన్య ప్రజలకు అందించడమే ధ్యేయంగా ముందుకెళుతున్నామని అన్ని డిపార్ట్మెంట్స్ శ్రీ దిశ హాస్పిటల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు . ఈకార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ రాష్ట్ర నాయకులు గుండెపాక నర్సయ్య , స్పర్శ భాస్కర్ , బీసీ జేఏసీ చైర్మెన్ పెరుగు వెంకటరమణ యాదవ్ ,తెలంగాణ యాదవమహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మ రోశయ్య ,తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ నరేందర్ , బిఆర్ఎస్ పార్టీ ఎస్సి సెల్ నాయకులు నెమలి కిషోర్ , ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ రమేష్ , సోమన బోయిన రమేష్ ,అనిల్ ,అజయ్ హాస్పిటల్ సిబ్బంది , వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు . సుమారుగా 150 మంది ప్రజలు ఉచిత ఫైబ్రోస్కాన్ మరియు బీఎండీ పరీక్షలను ఉపయోగించుకున్నారు . ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం కొనసాగింది . ప్రజల నుండి మంచి స్పందన వచ్చింది . ఇలాంటి ఉచిత పరీక్ష శిబిరాలు సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరమని ప్రజలు ప్రోత్సహిస్తున్నారు .

## బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేయస్కరం.. సిడిపిఓ సత్యావతి

- ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



**సత్తుపల్లి ఆగస్ట్07(ప్రజా జ్యోతి )**బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేయస్కరం అని సత్తుపల్లి సిడిపిఓ సత్యావతి అన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల అంగన్వాడి సెంటర్..3 నందు సూపర్వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహార విలువలు ముర్రుబాలు వంటి వాటిపై తల్లులకు గర్భిణీలకు వివరించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వల్ల, బిడ్డ ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని,జీర్ణ వ్యవస్థ వయసుకు తగ్గ బరువు పెరగటం లో ఈ పాలు ఎంతగానో దోహదపడ తాయని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, తల్లిపాలు క్రమం తప్పకుండా ఆరు నెలల వరకు అందించాలని, దాని ద్వారా తల్లికి బిడ్డకి మంచి అనుబంధం ఏర్పడుతుందని వివరించారు. డబ్బా పాలు పట్టి పిల్లల ఆరోగ్యాన్ని పాడు చేయవద్దని, సకల పోషకాలు తల్లిపాలలోనే సమృద్ధిగా ఉంటాయని వివరించారు. తల్లిపాలు తాగిన పిల్లలు చురుకుగా ఉంటారని, తెలివితేటలు ఎక్కువగా ఉంటాయని,తల్లిపాలపై ప్రాముఖ్యతను క్షుణ్ణంగా తెలిపారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నప్రాసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సకినా, లలిత ,జ్యోతి ,పుష్పావతి, సీత, గంగాభవాని,విజయలక్ష్మి కృష్ణకుమారి,సౌభాగ్యవతి, ఆశ వర్కర్లు, చిన్నారులు,ఆయాలు పాల్గొన్నారు.

## విలేకరి కుటుంబానికి షైన్ హైస్కూల్ ఆర్థిక సహాయం

- అందజేసిన షైన్ హై స్కూల్ కరెస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా

**బోనకల్,ఆగస్టు 07(ప్రజా జ్యోతి ):**ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బోనకల్ మండలానికి చెందిన "విజన్ ఆంధ్రా" దినపత్రిక విలేకరి మందా సత్యనందం కుటుంబాన్నీ శుక్రవారం షైన్ హై స్కూల్ కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా,డైరెక్టర్లు లాల్ మహమ్మద్,సిరి ఫర్హాద్ లు వారి స్వగృహానికి వెళ్లి సత్యానందం కుటుంబ సభ్యులను పరామర్శించారు. విలేకరి సత్యానందం మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం సత్యానందం సతీమణికి 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో షైన్ హై స్కూల్ ప్రిన్సిపల్ అయిటి పాముల శ్వేత,అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి, షేక్ ఖాజా పాషా తదితరులు ఉన్నారు.

## నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



**నేలకొండపల్లి, ఆగస్టు 7ప్రజా జ్యోతి :**ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ...శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు.మండలం లోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. రాజేశ్వరపురం పాఠశాల లో జరిగిన కార్యక్రమంలో యుఎస్పీఎస్ నాయకులు టి.వెంగళరావు మాట్లాడారు...ప్రభుత్వం ఆందోళనల పట్ల స్పందించకుంటే చలో అసెంబ్లీ కార్యక్రమం ను చేపడతామని పేర్కొన్నారు. 12,13 తేదీలలో మండల కేంద్రాలలో వినతి పత్రాలు అందజేత, 21 నుంచి 26 వరకు నాయకులు పర్యటనలు, 29 న `హైద్రాబాద్ లో మహాధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు జ్యోతి, చొక్కారావు, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మండల,గ్రామ కమిటీల నిర్మాణం కొరకు ఇంచార్జీల నియామకం

- కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఏ ఐ సి సి సంఘటన్, సృజన్, అభియాన్ ప్రక్రియలో భాగంగా టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం ఆగష్టు 15 లోపు మండల, గ్రామ కమిటీల నిర్మాణం పూర్తి చేయవలసి ఉన్నది కావున సంబంధిత మండల అధ్యక్షులతో సమన్వయం చేసుకొని కమిటీలను పూర్తి చేయుటకు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులను ఇంచార్జిలుగా నియమించి వారితో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో సమావేశం ఏర్పాటుచేసి దిశా నిర్దేశంచేసశారు.అదే విధంగా కమిటీల నిర్మాణం అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని పూర్తి చేయాలని కోరిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులిపాటి వెంకయ్య, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్,జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు తూములూరి లక్ష్మీ నరసింహా రావు,కిలారు అనిల్ కుమార్,రామసహాయం హరితరెడ్డి,కమటాల రేణుక, బచ్చలకూర నాగరాజు,మూడుముంతల గంగరాజు యాదవ్, కొట్టే రాజశేఖర్,కంచర్ల వెంకటనర్సయ్య,పులిబండ్ల చిట్టిబాబు,దామా స్వరూప, గాదె ఝాన్సీ, షేక్ మస్తాన్,మద్దినేని రమేష్,కిలారు వెంకటరమణ,బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, షేక్ యాసిన్,పంది రాజు గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలుకు అభినందనల వెల్లువ

- ఘనంగా సన్మానించిన టీఎస్ జేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఇజ్రాయిల్, మాజీ సర్పంచ్ గడ్డి కొప్పుల రాజు

**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి ఆగస్టు 7:**గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తన సొంత ఖర్చులతో రేకుల షెడ్ ఏర్పాటు చేసిన ఉపాధ్యాయురాలు ఇందిరాపై పలువురు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆమె చేసిన సేవను గుర్తిస్తూ ఇటీవల పత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనానికి స్పందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాఠశాలకు రూ.25 లక్షలతో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా టీఎస్ జేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఇజ్రాయిల్, మాజీ సర్పంచ్ గడ్డికొప్పుల రాజు కలిసి ఉపాధ్యాయురాలు ఇందిరాను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయురాలు ఇందిరా చేసిన సేవ ప్రతి ఉపాధ్యాయుడికి ఆదర్శప్రాయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, విద్యార్థులకు సరైన వసతి, రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో స్వంత నిధులతో రేకుల షెడ్ నిర్మించడం అభినందనీయమని కొనియాడారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన మీడియా కథనానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయడం ఆనందదాయకమని తెలిపారు. నూతన భవనం నిర్మాణంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కలుగుతుందని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వారు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థులు ఉపాధ్యాయురాలు ఇందిరా కు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గడ్డికొప్పుల రాజు మాజీ సర్పంచ్ ఉన్నం వీరభద్రం గడ్డికొప్పుల సుధాకర్ దాసరి మెరిషమ్మ గడ్డికొప్పుల కిరణ్ ఎరగానీ సరస్వతీ గడ్డికొప్పుల ప్రసాద్ చింతపల్లి వీరబాబు కొప్పుల బాబు పేరం భార్గవి విసంపల్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.



# వర్షాకాలంలో పాము కాటు పట్ల అప్రమత్తత అవసరం

- : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి రామారావు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాము కాటు ఇంజెక్షన్ అందుబాటులో ఉన్నాయి,వర్షాకాలంలో కురుస్తున్న వర్షాల కారణంగా పాములు, ఇతర విషకీటకాలు తమ బొరియలు, నివాసాల నుండి బయటకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు, ముఖ్యంగా రైతులు మరియు పొలం పనులు చేసే కూలీలు పాము కాటు పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఖమ్మం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి సూచించారు.జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో పాము కాటుకు ఇచ్చే నిరోధక ఇంజక్షన్, తగినంత అందుబాటులో ఉన్నాయని,ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు,రైతులు, పొలం పనులు చేసే కూలీలు తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు ఏమనగా కాళ్లకు చెప్పులు ధరించడం,పొలాల్లో పనులు చేసేటప్పుడు, గడ్డి కోసేటప్పుడు తప్పనిసరిగా కాళ్లకు ఎత్తైన బూట్లు మరియు చేతులకు తొడుగులు ధరించాలి,చీకటి వేళల్లో లేదా రాత్రి పూట పొలాలకు, బావుల వద్దకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా టార్చ్ లైట్ ఉంచుకోవాలి,కర్రతో శబ్దం చేయడం,దట్టమైన గడ్డి, చెత్తాచెదారం లేదా పొదలు ఉన్న ప్రాంతాల్లో నడిచేటప్పుడు కర్రతో నేలపై తడుతు శబ్దం చేస్తూ ముందుకు సాగాలి,శబ్దానికి పాములు దూరంగా వెళ్లిపోతాయి, చేతులు నేరుగా పెట్టకపోవడం: రాతి గుట్టలు, చెట్ల తొర్రలు, బొరియలు లేదా పాత సామగ్రి ఉన్న ప్రదేశాల్లో ఆలోచించకుండా నేరుగా చేతులు పెట్టకూడదు, ఇంటి పరిసరాల పరిశుభ్రత,నివాస ప్రాంతాల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, పొదలు మరియు చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి,ధాన్యం నిల్వలు ఉన్న చోట ఎలుకలు చేరకుండా చూసుకోవాలి, ఎందుకంటే ఎలుకల కోసం పాములు వచ్చే అవకాశం ఎక్కువ,పాము కాటుకు గురైతే భయం వద్దు,పాము కాటుకు గురైన వ్యక్తి భయాందోళనకు గురికాకుండా ధైర్యం చెప్పాలి భయపడటం వల్ల గుండె వేగం పెరిగి విషం వేగంగా శరీరమంతా వ్యాపిస్తుంది,కదలికలు నిలిపివేయాలి,కాటు వేసిన చేయి లేదా కాలును ఎక్కువగా కదల్చకుండా నిశ్చలంగా ఉంచాలి.నాటు వైద్యం చేయ వద్దు, మ ంత్రాలు, మూలిక లు లేదా నాటు వైద్యం నమ్మి కాలాన్ని వృథా చేయకూడదు, కోతలు పెట్టకూడదు కాటు వేసిన చోట కత్తితో కోయడం, నోటితో విషాన్ని పీల్చే ప్రయత్నం,చేయడం లేదా రక్తం సరఫరా ఆగిపోయేలా గట్టిగా కట్టు కట్టడం వంటివి చేయకూడదు,వెంటనే ఆసుపత్రికి తరలించాలి,బాధితుడిని వీలైనంత త్వరగా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గానీ, ప్రభుత్వ ఆసుపత్రికి గానీ తరలించి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించాలి.జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పాము కాటుకు అవసరమైన ఉచిత వైద్యం మరియు మందులు నిరంతరం అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కోరారు.

## ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలి

- సిఐటియు కేంద్ర కమిటీ సభ్యులు కళ్యాణపు వెంకటేశ్వరరావు




**బోనకల్, ఆగస్టు 7(ప్రజా జ్యోతి ):** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో అంగన్వాడీలు, ఆశాలు, గ్రామపంచాయతీ వర్కర్లు, ఆటో డ్రైవర్లు, హమాలీలు, బిల్డింగ్ వర్కర్లు, కార్మికులు, పోరాటాలు నిర్వహించాలని సిఐటియు కేంద్ర కమిటీ సభ్యులు కళ్యాణపు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో సిఐటియు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆగస్టు 10వ తారీఖు జైలు బరో కార్యక్రమం సంబంధించిన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరలు చట్టం చేయాలని రైతులు పేదల కోసం సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని, తదితర డిమాండ్స్ తో ఆగస్టు పదో తారీఖున జైలు భరో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందనీ అని అన్నారు. ఈ కార్యక్రమానికి కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బోయినపల్లి వీర బాబు, సిఐటి మండల కన్వీనర్ నరేష్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు సత్తుపాటి రాణి, అంగరేకుల నాగలక్ష్మి, బండి జయమ్మ, కళ్యాణపు రాణి, చేబ్రోలు ఉష , గుగులోతు ఉష తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఉన్నత పాఠశాలకు మైకు సెట్ వితరణ



**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** మండల పరిధిలోని బనిగండ్లపాడు శీలం రామ్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉన్నత పాఠశాల కు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కోన యోగేశ్వరరావు తల్లి కోనా విజయలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా సుమారు 30 వేల రూపాయల విలువ గల మైక్ సెట్ ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను అభినందించి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బలుసుపాటి జయరాజు, అమృత సాయి ఇంజనీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్ కోన రాంబాబు,బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగా గురునాథరెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, శీలం అశోక్ రెడ్డి, ఉప్ప సర్పంచ్ రామిరెడ్డి, కోనా సత్యనారాయణ గుప్తా, యన్నం సుధాకర్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


## పంచాయితీ రాజ్ డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక సందర్శన



**తల్లాడ ప్రజా జ్యోతి** మండల ప్రజా పరిషత్ కార్యాలయం, తల్లాడ లో గురువారం పంచాయితీ రాజ్ డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీధర్ రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ,ప్రతి గ్రామ పంచాయతీలో ఈ నెల 12వ తేదీ లోపు కనీసం 20 పంట కుంటలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అదేవిధంగా 14వ తేదీ లోపు అన్ని గ్రామ పంచాయతీలు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏన్మూర్ భాగ్యశ్రీ, ఏపీడీ చలపతి, కల్లూరు డి ఎల్ పి ఓ విజయ లక్ష్మీ,అదనపు పీడీ శిరీష , ఎంపీవో తల్లాడ హరికృష్ణ, ఏన్మూర్ జి వి ఎస్ నారాయణ , ఎస్‌బీఎం డీపీఎం అనూప్ , మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,తల్లాడ మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నరు.

## టేకులపల్లి కేసీఆర్ డబల్ బెడ్ రూమ్ ఇల్లు సముదాయం లో పాముల భయం

- వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు, బాధితుల విజ్ఞప్తి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం నగర పరిధిలోని టేకుల పల్లి వద్ద నిర్మించిన కేసీఆర్ టవర్స్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో ప్రజలు తీవ్ర భయాందోళనల నడుమ కాలం వెళ్లదీస్తున్నారు.ఇక్కడ నివాసముంటున్న పేద ప్రజలు నిత్యం విషసర్పాల సంచారంతో ప్రాణాలు గుప్పెట్లో పట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

**సమస్య తీవ్రత – ప్రజల ఆందోళన:**

**విషసర్పాల సంచారం:** ఇళ్ల ప్రాంగణంలోకి, మెట్ల కిందకు,చివరికి ఇళ్ల లోపలికి కూడా త్రాచుపాములు,ఇతర విషసర్పాలు వస్తుండటంతో స్థానికులు తీవ్ర తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.చిన్నారులు,వృద్ధుల

**భద్రత:** రాత్రి వేళల్లో విద్యుత్ సరిగా లేకపోవడం, తోడవుతున్న చెత్తాచెదారంతో చిన్న పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుండి బయటకు రావాలన్నా, నిద్రపోవాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది.

**పిచ్చిమొక్కలు – పిచ్చిచెట్లు:** కేసీఆర్ టవర్స్ పరిసరాల్లోనూ,రోడ్లకు ఇరువైపులా విపరీతంగా పిచ్చిమొక్కలు, దట్టమైన పొదలు పెరిగిపోయాయి. ఇవే పాములు, ఇతర విషకీటకాలకు ప్రధాన ఆవాసాలుగా మారాయి.

**మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్యలు:** డబుల్ బెడ్‌రూమ్ కాలనీ ప్రారంభమై కాలం గడుస్తున్నా, నిర్వహణ లోప స్పష్టంగా కనిపిస్తోంది. కాలనీ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను, కాల్వలలోని పూడికను ఎప్పటికప్పుడు తొలగించడంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని బాధితులు వాపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల నీరు నిలిచిపోయి దోమల వ్యాప్తితో పాటు పాములకు సురక్షిత స్థావరాలుగా మారుతున్నాయి.

**ప్రజల ప్రధాన డిమాండ్లు:**

**పరిసరాల శుభ్రత:** డబుల్ బెడ్‌రూమ్ కాలనీ పరిసరాల్లో,రోడ్లకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు,పొదలను వెంటనే యంత్రాలతో తొలగించాలి.

**చెత్తాచెదారం తొలగింపు:** కాలనీలో నిలిచిపోయిన వ్యర్థాలను, చెత్తను ఎప్పటికప్పుడు మున్సిపల్ వాహనాల ద్వారా తరలించాలి.

**ఫాగింగ్, స్ప్రేయింగ్:** పాములు,విషకీటకాలు రాకుండా క్రిమిసంహారక మందులు చల్లడంతో పాటు క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలి.

**అధికారు స్పందనకై విజ్ఞప్తి:** మున్సిపల్, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలి.టేకులపల్లి కేసీఆర్ టవర్స్‌ను సందర్శించి,క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి శుభ్రతా చర్యలు చేపట్టాలని కెసిఆర్ టవర్ డబుల్ బెడ్ రూమ్ లో నివసించే ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.ఏదైనా అవాంఛనీయ సంఘటన లేదా ప్రాణనష్టం జరగకముందే అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఏఎస్సై ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** గురువారం వివిధ పోలీస్ స్టేషన్ లలో హెడ్ కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్) గా ఉద్యోగన్నతి పొందిన 28 మంది పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి,అభినందనలు తెలియజేశారు.పదోన్నతి పొందిన వారు భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, మహబూబాబాద్ జిల్లా కు బదిలీపై వెళ్ళనున్నారు.

## అంగన్వాడీల్లో తల్లిపాల వారోత్సవాలకు ఘన ముగింపు

**కల్లూరు ఆగస్టు 07 : ప్రజా జ్యోతి** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా కల్లూరు మండల పరిధిలోని యజ్ఞారణపురం, ముచ్చవరం గ్రామ పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు కర్నాటి కోటేశ్వరి, కంచ పోగు సుజాత మాట్లాడుతూ పుట్టిన వెంటనే నవజాత శిశువుకు తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని తెలిపారు. ముర్రుపాలు శిశువుకు తొలి రోగ నిరోధక శక్తిని అందిస్తాయని తొలి ఆరు నెలలు తల్లిపాలే ఉత్తమ ఆహారమని వివరించారు. గర్భిణులు బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యలక్ష్మి పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐఎఫ్ఎ (ఐరన్ పోలిక్ యాసిడ్) మాత్రలు వాడాలని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. సెక్టర్ సూపర్వైజర్ సుజాత తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం చిట్టెమ్మ గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు అంగన్వాడీ టీచర్లు జ్యోతి సులోచన శైలజ నిర్మల కరుణకుమారి ఆశా కార్యకర్తలు గర్భిణీలు బాలింతలు తల్లులు చిన్నారులు పాల్గొన్నారు.



# ఆళ్లపాడులో ఇంటి స్థలం, పొలం విషయం పై వివాదం

- బండి ఉపేంద్ర పై దాడి
- తలకు తీవ్ర గాయాలు



**బోనకల్, ఆగస్టు 7 (ప్రజా జ్యోతి):** కుటుంబంలో ఇంటి స్థలం, పొలం పంపకం విషయంపై వివాదంతో జరిగిన దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలోనే ఆళ్లపాడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు బండి ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం..బండి నారాయణకు ఇద్దరు సోదరులు ఉన్నారు. వీరి ముగ్గురికి ఇంటి స్థలం, పొలం విషయంపై గత కొంతకాలంగా వివాదం కొనసాగుతుంది. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన బండి నారాయణ బంధువులైన మందా రామారావు ఇంటి వద్ద పంచాయతీ నిర్వహించారు. మంద రామారావు బండి నారాయణ కుమారుడు బండి ఉపేందర్ కు ఫోన్ చేసి పంచాయతీకి రావాలని పిలిపించారు. దీంతో ఉపేంద్ర అక్కడికి వెళ్ళటానికి నిరాకరించాడు. ఆ తర్వాత వాళ్లే ఉపేందర్ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగింది. నాయనమ్మ రాములమ్మ జీవించినంత కాలం స్థలం, పొలం అమ్మటానికి గాని పంచడానికి గాని వీలులేదని ఉపేందర్ పట్టుపట్టాడు. దీంతో బండి ఉపేందర్ తమ మాట వినటం లేదని కోపం, ఆవేశంతో బంధువులైన మంద కృష్ణ కర్రతో ఉపేందర్ తలపై బలంగా కొట్టాడు. దీంతో ఉపేందర్ తల పగిలింది. మంద కృష్ణ ఉపేందర్ పై కర్రతో దాడి చేస్తుండగా మంద రామారావు, బండి వెంకటేశ్వర్లు, బండి సుబ్బారావు, కిందపడేసి ఇష్టం వచ్చినట్లు కొట్టారు. అదే రోజు తాను స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు బండి ఉపేందర్ తెలిపారు. మధిర ఏరియా ఆసుపత్రికి వెళ్ళగా తలకు మూడు కుట్లు పడినట్లు ఉపేందర్ తెలిపాడు.

## భైరవునిపల్లి గ్రంథాలయానికి వితరణ


- మల్లెబోయిన మహేష్ సత్కార్యం



**నేలకొండపల్లి, ఆగస్టు 7 ప్రజా జ్యోతి:** గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగులు నింపేలా భైరవునిపల్లి గ్రామానికి చెందిన యువకుడు మల్లెబోయిన మహేష్ గొప్ప ఉదారతను చాటుకున్నారు. గ్రామంలోని గ్రంథాలయానికి విద్యార్థుల చదువుకు ఉపయోగపడే రూ. 15,000 విలువైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం మరియు జేఈఈ (JEE) మెయిన్స్ పోటీ పరీక్షల పుస్తకాలను శుక్రవారం విరాళంగా అందించారు. గ్రామ సర్పంచ్ గుండపునేని లక్ష్మణ్ రావు చేతుల మీదుగా ఈ పుస్తకాలను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పెద్దపాక వెంకటేశ్వరరావుకు ఘనంగా అందజేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుపేద విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతగానో తోడ్పడతాయని, మహేష్ చేసిన ఈ సాయం ఎంతో అభినందనీయమని సర్పంచ్ కొనియాడారు. అనంతరం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మహేష్‌ను ప్రత్యేకంగా అభినందించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మరికంటి రమేష్, గండు సైదులుతో పాటు గ్రంథాలయ కమిటీ సభ్యులు కుంచం బిక్షం, చిలివేరు రేణుబాబు, చట్టు ఉపేందర్, కనకబండి లక్ష్మీనారాయణ, పూజల రామకృష్ణ, కంచర్ల వెంకటేశ్వర్లు, గుండపునేని గోపి తదితరులు పాల్గొని మహేష్ ఉదారతను ప్రశంసించారు.

## ప్రకృతి ప్రసాదించిన అమృతం 'ఆయుర్వేదం' – వృక్షో రక్షతి రక్షితః

- భారతీయ సనాతన వైద్య విధానం మానవాళి ఆరోగ్యానికి మరియు ప్రాణ రక్షణకు మూలస్తంభం
- ఆయుర్వేద నిపుణులు డాక్టర్ ఉపేందర్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఆధునిక విజ్ఞాన శాస్త్రం (సైన్స్) రూపుదిద్దుకోక ముందే, వేల సంవత్సరాల క్రితమే భారతదేశంలో రూపుదిద్దుకున్న మహోన్నత వైద్య విధానం 'ఆయుర్వేదం'. క్రీస్తు పూర్వ కాలం నుంచే మన ప్రాచీన మహర్షులు, ధన్వంతరి, చరకుడు, సుశ్రుతుడు వంటి పండితులు తమ తపోశక్తితో, పరిశోధనలతో మానవాళికి ప్రసాదించిన అమూల్యమైన వరమిది. కేవలం రోగాన్ని నయం చేయడమే కాకుండా, మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించే జీవన శైలిని ఆయుర్వేదం నేర్పించింది.

**ప్రకృతిలో ప్రతి మొక్కా ఒక ప్రాణదాత:** ఆయుర్వేద సిద్ధాంతం ప్రకారం భూమిపై పుట్టిన ప్రతి వృక్షం, ప్రతి మొక్క ఏదో ఒక ఔషధ గుణాన్ని కలిగి ఉంటుంది. ప్రకృతిలో వ్యర్థమైన మొక్క అంటూ ఏదీ లేదు. మన చుట్టూ ఉండే ప్రశాంతమైన చెట్లు పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా, మానవుని ఆయుష్షును పెంచే అమృత గనులుగా పనిచేస్తాయి.

**చెట్టు – సమగ్ర ఔషధ నిధి:** ఆయుర్వేద వైద్యంలో ఒక చెట్టులోని ప్రతి భాగం అత్యంత విలువైనది

**వేర్లు:** శరీరంలోని వేర్వేరు వ్యాధులను మూలాల నుండి నిర్మూలించే కషాయాలకు, రసాయనాలకు వేర్లు ఉపయోగిస్తారు.

**కాండం,బెరడు:** రక్తాన్ని శుద్ధి చేయడానికి, చర్మ రోగాలను మరియు లోపలి వాపులను తగ్గించడానికి ఇవి తోడ్పడతాయి.

**ఆకులు:** విష పదార్థాలను శరీరం నుండి తొలగించడానికి, కంటి, శ్వాసకోశ సమస్యలను నయం చేయడానికి ఆకుల రసాలు ఉపయోగిస్తారు.

**పువ్వులు, పండ్లు, విత్తనాలు:** శరీరానికి శక్తిని ఇవ్వడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి.

**పర్యావరణ రక్షణ – మానవ ఆరోగ్యం:** చెట్లు కేవలం ప్రాణవాయువును (ఆక్సిజన్) అందిస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడటమే కాకుండా, ఆయుర్వేద వైద్యానికి కావలసిన మూలికలను అందిస్తూ మానవాళిని కాపాడుతున్నాయి. ప్రకృతిని మనం రక్షిస్తే, ఆ ప్రకృతి మనల్ని ఆరోగ్యం రూపంలో రక్షిస్తుంది.

**నేటి తరానికి ఆయుర్వేదం అత్యంత ఆవశ్యకం:** కృత్రిమ రసాయనాలు, దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్ ) లేని సహజసిద్ధమైన వైద్యాన్ని అందించే ఏకైక మార్గం ఆయుర్వేదం. ప్రస్తుత కాలంలో వస్తున్న కొత్త రకాల వ్యాధులకు, మానసిక ఒత్తిళ్లకు ప్రకృతి సిద్ధమైన ఆయుర్వేద జీవన విధానమే సరైన పరిష్కారం. మన ప్రాచీన ఋషులు అందించిన ఈ ఆయుర్వేద విజ్ఞానాన్ని గౌరవిద్దాం, చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం, ప్రకృతి ప్రసాదించిన ఔషధ విధానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుదాం.

## ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలలు పరిష్కరించాలి

- టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ
- యు ఎస్ పి సి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన



**బోనకల్, ఆగస్టు 7(ప్రజా జ్యోతి):** యు యస్ పిసి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం నాడు బోనకల్ మండల వ్యాప్తంగా మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి పాఠశాలల ఎదుట ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో తాత్సారం చేయడం తగదని, పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని, పెండింగ్లో ఉన్న ఆరు డిఎలను విడుదల చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, బీసీ గురుకుల టైం టేబుల్ మార్చాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు రెగ్యులరైజ్ చేయాలని, టైం స్కేల్ ఇవ్వాలని, కేర్ టేకర్స్ ను నియమించాలని, గురుకుల ఉపాధ్యాయులకు ప్యారిటీ స్కేల్స్ ఇవ్వాలని, పిఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని, 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, పెండింగ్లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు సద్దా బాబు, మండల అధ్యక్షులు చిన్న రంగారావు, టిపిటిఎఫ్ నాయకులు యాకూబ్ పాషా, నాగుల్ మీరా, టీఎస్ యుటిఎఫ్ మండల ఉపాధ్యక్షులు పి గోపాలరావు, మండల కోశాధికారి పి. నరసింహ రావు, మండల ఉపాధ్యక్షురాలు బి సౌభాగ్య లక్ష్మి, సీనియర్ నాయకులు నాగ మహేష్, బి నిర్మల, సిహెచ్ కోటేశ్వరరావు,ఎ. నాగేందర్, మండల ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ జిల్లా కోటయ్య, సోషల్ మీడియా కన్వీనర్ నరేంద్ర సింహఎం. నారాయణ, బానోత్. రమేష్, కమలాకర్, వీరన్న, ప్రమీల, పద్మావతి, గంగాభవాని, ఎం రామకృష్ణ, బ్రహ్మం సాహెబ్, కే వెంకటేశ్వర్లు, కే. సురేష్ బి. శ్రీనివాసరావు, వి రామారావు,రాణి,లావణ్య ,అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న 17 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించిన ఇన్స్పెక్టర్ కరుణాకర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన సుమారు 17 మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం ( సీఈఐ ఆర్ పోర్టల్ అలాగే ఐ ఎం ఈ ఐ ట్రాకింగ్) సహాయంతో పోలీసులు విజయవంతంగా రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. వన్ టౌన్ సిబ్బంది, ఐటి కోర్ టీం సమన్వయంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఈ ఫోన్లను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారని,రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు స్వయంగా అందజేశామని తెలిపారు. ఇప్పటివరకు 613 ఫోన్లు అప్పగించినట్లు తెలిపారు.తమ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.నేటి ఆధునిక కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం సమాచార సాధనం మాత్రమే కాదని, అది ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం, ఆర్థిక లావాదేవీలకు కీలకమైన వనరు అని అన్నారు.

## విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు వాషింగ్ మెషీన్లు పంపిణీ

- కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి మందా సరస్వతి పిలుపు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** గురువారం ఖమ్మం జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మందా సరస్వతి విశ్వకర్మ పథకం కింద రుణాలు మంజూరైన లబ్ధిదారులకు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు రూ. 15,000 విలువైన కిట్లు, వాషింగ్ మెషీన్లను అందజేశారు. అలాగే అర్హులైన అభ్యర్థులకు రూ.1 లక్ష వరకు రుణాలు కూడా మంజూరు చే యడం జరిగింది.ఈ అవకాశాన్ని కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మందా సరస్వతి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,కేంద్ర ప్రభుత్వం అమలు చే స్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి లబ్ధిదారులుగా పాల్గొన్నారు. స్వర్ణ , గీతా , రమేష్ , సుజాత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన నలుగురు పిల్లలు

- ట్రాఫిక్ సిఐ బెల్లం సత్యనారాయణ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి,మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన నలుగురు పిల్లలను ట్రాఫిక్ పోలీసులు జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచారు. మైనర్ డ్రవింగ్ చేస్తున్న వారి ప్రవర్తనా మార్పు కోసం, సామాజిక బాధ్యతను పెంపొందించేలా జువెనైల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి బి.రజని నెల రోజుల పాటు వారంలో ఒక రోజు అబ్జర్వేషన్ హోమ్‌లకు (పరిశీలన కేంద్రాలకు ) హాజరు కావాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న,నిబంధనలు ఉల్లంఘిస్తున్న మైనర్ డ్రైవర్ల విషయంలో జువెనైల్ జస్టిస్ బోర్డు కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే ఇకపై చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు.

# మంకెన రమేష్‌ను పరామర్శించిన సర్పంచ్ వీరబాబు



**చింతకాని ఆగస్టు 07ప్రజాజ్యోతి :** నేరడ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మంకెన రమేష్ ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకోవడంతో, తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పరామర్శించారు.ఈ సందర్భంగా మంకెన రమేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సర్పంచ్ వీరబాబు,ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకొని మునుపటిలాగే ప్రజాసేవలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు.వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు మంకెన రమేష్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ పరామర్శ కార్యక్రమంలో తిరుమలాపురం గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గోగుల నరసింహారావు, ఉస్మానియా యూనివర్సిటీ బీసీ విద్యార్థి నాయకుడు గోదా రవీందర్, బీఆర్ఎస్ యువజన విభాగం గ్రామ అధ్యక్షుడు బండి సైదులు, బీసీ సెల్ గ్రామ అధ్యక్షుడు మడిపల్లి సైదులు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మరీదు మధు, బీఆర్ఎస్ గ్రామ కోశాధికారి గోదా ప్రసాద్, పార్టీ కార్యకర్తలు చింతల రామకృష్ణ, మడిపల్లి రామకృష్ణ, తదితరులు పాల్గొని మంకెన రమేష్‌కు ధైర్యం చెప్పారు.

# తల్లిపాలే బిడ్డకు తొలి అమృతం సర్పంచ్ -పక్కృద్దీన్



**వేంసూరు ఆగష్టు 7ప్రజాజ్యోతి** ఆగస్టు 1 నుండి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఈరోజు తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి ప్రతి తల్లి తన బిడ్డకు పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలను అందించడం ఎంతో ముఖ్యమైనది. పుట్టిన మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. ఆరు నెలల తర్వాత పోషకాహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా బలంగా ఎదుగుతుంది.తల్లిపాలలో శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి సహజసిద్ధంగా లభిస్తాయి. తల్లిపాలు బిడ్డను అనేక అంటు వ్యాధుల నుంచి రక్షించడమే కాకుండా, తల్లి ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయి సర్పంచ్ ఫకృద్దీన్ ఈ కార్యక్రమాన్ని ఉంద్దేశించి చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫకృద్దీన్ తో పాటుగా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లెల్లి నరసింహాస్వామి 12 వ వార్డ్ నెంబర్ పిల్లి రమణ నక్క శ్యాంబాబు వలికొట్టె కోటయ్య అంగన్వాడీ సిబ్బంది మొదలైన వారు పాల్గొన్నారు.

# ఈ నెల 10 న జైల్ బరో జయప్రదం చేయండి

- : రావుల రాజబాబు(సీపీఎం డివిజన్ నేత)



**వేంసూరు, ఆగస్టు07ప్రజా జ్యోతి :** ఆగస్టు10 న కార్మిక,కర్షక,కూలీల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జైల్ బరో కార్యక్రమంలో రాజకీయాలతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం సత్తుపల్లి డివిజన్ నాయకుడు రావుల రాజబాబు పిలుపునిచ్చారు.శుక్రవారం మండల పరిధిలోని లింగపాలెం గ్రామంలో జరిగిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో పాల్గొన్న రావుల మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో: సీపీఎం సీనియర్ నాయకులు కొత్తా సత్యనారాయణ,గ్రామ శాఖా కార్యదర్శి కొత్తా అప్పారావు,రాయల చెన్నారావు,సుజాత,బేతిని చెన్నారావు, రావుల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఇందిరా డైరీని సద్వినియోగం చేసుకొని ఆర్ధికంగా అభివృద్ధి చెందాలి

- మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు



**చింతకాని ఆగస్టు 08ప్రజాజ్యోతి :** చింతకాని మండల కేంద్రంలోని రైతు వేదికలో వెలుగు ఆధ్వర్యంలో, డైరీ ఏపీఎం లక్ష్మణరావు అధ్యక్షతన ఇందిరా డైరీ పథకానికి సంబంధించి మైనార్టీ లబ్ధిదారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ, ఇందిరా డైరీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మానస పుత్రిక అని , భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలోనే బోనకల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ డైరీకి రూపకల్పన చేశారని తెలిపారు.మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.చింతకాని మండలంలోని సుమారు 4 వేల మంది మహిళా సభ్యులకు ఇందిరా డైరీ పథకం ద్వారా సబ్సిడీపై గేదెలను అందించి, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుండటం అభినందనీయమన్నారు. ఇందిరా డైరీ ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నారు. ప్రభుత్వం ద్వారా గేదెలను పొందిన డ్వాక్రా మహిళలు వాటిని విక్రయించకుండా,గేదెల ద్వారా లభించే పాల ఉత్పత్తులను విక్రయిస్తూ ఆదాయం పెంచుకోవాలని తద్వారా తమ కుటుంబాల ఆర్థిక అవసరాలను తీర్చుకోవడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు.మహిళా సాధికారతే రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది అని ,మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని అంబటి అకాంక్షించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో అధికారులు పాడి పరిశ్రమపై అవగాహన కల్పించడంతో పాటు ఆధునిక పశుపోషణ పద్ధతులు, పశువుల ఆరోగ్య సంరక్షణ, మేత నిర్వహణ, పాల ఉత్పత్తి పెంపు తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. లబ్ధిదారులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి, పశువుల సంరక్షణలో మెరుగైన పద్ధతులను పాటిస్తూ అధిక పాల ఉత్పత్తి సాధించాలని, తద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యదవ్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు మడుపల్లి భాస్కరరావు, జిల్లా ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు, వ్యవసాయ శాఖ ఏ.డీ. వాణిశ్రీ, చింతకాని వెటర్నరీ డాక్టర్ రాంజీ, నాగులవంచ వెటర్నరీ డాక్టర్ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ వెటర్నరీ అధికారి పండగ బాబు, వెటర్నరీ డాక్టర్ నరసింహ, వెలుగు సీసీలు, డ్వాక్రా గ్రూప్ సభ్యులు, ఇందిరా డైరీకి ఎంపికైన మైనార్టీ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10 న మర్లపాడులో రహదారుల దిగ్బంధనం

- కదలిరండి కార్మిక,కర్షక, కూలీ మైత్రితో: మల్లూరు చంద్రశేఖర్(సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి)
- కార్పోరేట్ సంస్థలకు దోచి పెట్టడమే మోడీ ప్రభుత్వం లక్ష్యం:అర్వపల్లి జగన్మోహన్ రావు(సీపీఎం మండల కార్యదర్శి)




**వేంసూరు,ఆగస్టు 07ప్రజాజ్యోతి** ఆగస్టు 10 న సీఐటీయూ,ఏ.ఐ. కె.ఎస్., ఏ.ఐ.ఏ.డబ్ల్యూ.యు.లు సంయుక్తంగా మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై క్విట్ ఇండియా ఉద్యమం చేపట్టిన ఆగస్టు 09 స్ఫూర్తితో ఆగస్టు 10న ఇచ్చిన జైలు బరో కార్యక్రమం సందర్భంగా మండల పరిధిలోని మర్లపాడు గ్రామ సెంటర్ లో రహదారుల దిగ్బంధనం చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.శుక్రవారం సాయంత్రం మర్లపాడు గ్రామంలోని ఆల్ హమాలీ కార్మికుల అడ్డా వద్ద జరిగిన సభలో మల్లూరు మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరిస్తూ మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్లు తెచ్చిందని, దేశానికి అన్నం పెట్టే రైతన్నలను దగా చేస్తూ నూతన విద్యుత్ సంస్కరణలు తెచ్చి ద్రోహం చేస్తుందని,పల్లె పేదలకు కడుపు నింపడానికి తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టానికి గాంధీ పేరు తొలగించి గాంధీజీ నీ హత మార్చిన గాడ్సే పేరు కలుపుతూ వి.బి.జి.రామ్ జీ అని మార్చి చట్టాన్ని పథకంగా మార్చి నిధుల కేటాయింపు లేకుండా దుర్మార్గం చేస్తుందని దేశాన్ని, హక్కులను కాపాడుకోవడానికి కార్మికులు,కర్షకులు, కూలీలు మైత్రితో రాజకీయాలకతీతంగా 10 న పోరాటానికి కదిలిరావాలని పిలుపునిచ్చారు.జయప్రదం కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.అనంతరం సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు మాట్లాడుతూ దేశ ప్రజల హక్కులను కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పని చేస్తుందని ఐక్య పోరాటాలతో తిప్పి కొట్టాలని,సీపీఎం అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో: గజ్జెల్లి సత్యనారాయణ,గజ్జెల్లి వెంకటేశ్వరరావు,కనమాల నాగరాజు,దారా నాగరాజు, నడ్డి ప్రసాద్,నడ్డి వెంకటేశ్వరరావు,దారా శ్రీను,యామవరపు శ్రీను, పూరేటి శ్రీను,కనపర్తి కృష్ణ, వేము రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలి

- వ్యక్తిత్వవికాస నిపుణులు. చలసాని శ్రీనివాసరావు




**మధిర ప్రజా జ్యోతి** ఆన్సర్ రాస్తే మార్కులే వస్తాయి కానీ క్వశ్చన్ అడిగితే నాలెడ్జ్ వస్తుంది శుక్రవారం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మడుపల్లి లో నిర్వహించిన కౌన్సిలింగ్ కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు చలసాని శ్రీనివాస్ విద్యార్థులతో పాటు మదిర మండలం లోని టివిఎం హై స్కూల్ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధిర హరిజనవాడ ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాటూరు పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు...విద్యార్థి దశ నుండి మనసులో దాగి ఉన్న తపనను బయటకు తీసి సక్రమంగా వినియోగించగలిగితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని.. మొబైల్ ఫోను, సోషల్ మీడియాను విచక్షణతో ఉపయోగించాలని తద్వారా విలువైన సమయం వృధా కాకుండా ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల మరియు గురువుల మనసులో సుస్థిర స్థానం సంపాదించుకునే అవకాశం ఉంటుందని, స్వశక్తితో తమ జీవితాన్ని అందంగా మలుచుకోవచ్చని, ఏకాగ్రతతో సాధన చేస్తే విజయం సునాయాసమని అందుకోసం పుస్తకాన్ని మించిన మంచి మిత్రుడు లేడని.. స్నేహం కూడా స్నేహితుని జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేలా ఉండాలని, భయాన్ని విడనాడి నేచురల్ ఇంటెలిజెన్స్ ను వినియోగించుకోవాలని... సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని అహర్నిశలు.. ఆ లక్ష్య సాధన కోసమే కష్టపడాలని... తరతరాల దారిద్రాన్ని అంతం చేసే శక్తి విద్యలోనే ఉందని...నిజాయితీ ,వినయం , విధేయత,వివేకం,సానుభూతి సహానుభూతి, ధైర్యం, నైతిక విలువలు, నైపుణ్యాలు విద్యార్థుల జీవితాన్ని అందలమెక్కిస్తాయని...గురువుల మార్గదర్శకత్వంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని.. భవిష్యత్తు లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని మంచి భవిష్యత్తు దిశగా కష్టపడాలని, ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా సానుకూల దృక్పథంతో జీవితాన్ని గెలవాలని.. చదువు అంటే మార్కులే కాదు మంచి జీవనగమనాన్ని నేర్పించేదని.. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేశారు... ఈ కార్యక్రమానికి మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట నరసింహారావు అధ్యక్షత వహించగా, టీవీఎం జి హెచ్ ఎస్ మధిర కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సత్యజిత్ ఉపాధ్యాయులు ఏ అరుణశ్రీ ఎం రఘు జి నరసింహారావు , బొగ్గుల శ్రీనివాస రెడ్డి, కొలగాని శ్రీనివాసరావు రాజశేఖర్ ,లాల్ అహ్మద్, బూస కోటేశ్వరరావు, జ్ఞానేశ్వరాచారి, కంచిపోగు ఆదాం ,పైడిపల్లి కిషోర్, రామచంద్రరావు, సంధ్యాలక్ష్మి , శైలజ, మాధవి, శ్రీదేవి, సుష్మ మాధురి, సాములు, మల్లికార్జున శర్మ, మాధవరావు లతోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- టీఎస్ యుటిఎఫ్ సీనియర్ అనుమోలు కోటేశ్వరరావు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు ఎస్ పి సి ) పిలుపు మేరకు నాలుగు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎర్రుపాలెం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలు, ప్రాథమిక పాఠశాలలు ఉపాధ్యాయులు మరియు సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి పాఠశాల విధులకు హాజరై, భోజన విరామ {సమయంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఖమ్మం జిల్లా జిల్లా కార్యదర్శి అను మోలు కోటేశ్వరరావు టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కంచర్ల శ్రీనివాసరావు నంద్రు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల మరియు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పిసి)ఆధ్వర్యంలో అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో అనివార్యంగా నాలుగు దశల పోరాట కార్యక్రమాన్ని ప్రకటించడం జరిగిందని తెలియజేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 లోపు పిఆర్సి నివేదికను తెప్పించుకొని 01.07.2023 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న ఆరు డిఎ లను వెంటనే విడుదల చేయాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయల్లో ,అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులతో పాటు సమగ్ర శిక్షలు పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వెంటనే మినిమం టైం స్కేల్ ను వెంటనే వర్తింప చేయాలన్నారు. విద్యా శాఖలో ఖాళీగా ఉన్న పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు మరియు పదోన్నతుల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.రేషనలైజేషన్ జి ఓ 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీస ఇద్దరు టీచర్లు ,40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలకు ఐదుగురు టీచర్లను కేటాయించాల న్నారు. గురుకులాలు మరియు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 హెడ్ కింద వేతనాలు చెల్లించాలన్నారు.అందరికీ అందుబాటులో గల ప్రభుత్వ పాఠశాలల కుదింపు ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జి ఓ 317 కారణంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు ఉద్యోగులను తమ స్థానిక జిల్లాకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.పిఆర్ సి ని అమలు చేసేంతవరకు జిల్లాలోని ఉపాధ్యాయులందరూ ప్రతి రోజు నల్ల బ్యాడ్జిని ధరించి విధులకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 12 13తేదీల్లో జిల్లాలోని అన్ని తహసిల్దారు కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించాలన్నారు. ఆగస్టు 15 లోపు ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూల నిర్ణయం వెలబడకపోతే ఆగస్టు 19వ తేదీన జిల్లా కేంద్రాల్లో మరియు ఆగస్టు 29వ తేదీన రాష్ట్ర కేంద్రంలో వేలాదిమంది ఉపాధ్యాయులతో మహాధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపిటిఎఫ్ నాయకులు ముత్తయ్య భూషణ్ రాజు టీఎస్ యుటిఎఫ్ నాయకులు నీలం సైదారావు నరాల సాంబశివారెడ్డి ఎస్ వెంకమ్మ పుల్లయ్య సత్యనారాయణ జీవన్ సతీష్ రామకృష్ణ వెంకటకృష్ణటి కరీమునిషా నందిని లక్ష్మీ తిరుపతమ్మ శంకర్ శైల కుమారి ఇందిరా నాగేశ్వరరావు రత్న కుమారి నవీన్ రమేష్ సుబ్బరామ రాజు జి శ్రీనివాస్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మరియు సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

# బీజేపీ–కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమిటి?

- ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఉద్యమిస్తాం
- కాకరవాయిలో సీపీఐ ప్రజా చైతన్య యాత్ర





**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి, ఆగస్టు 7:** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యాయని సీపీఐ నాయకులు విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజలను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర కాకరవాయి గ్రామంలో కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలు, వ్యవసాయ రంగంలో నెలకొన్న ఇబ్బందులు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజలతో చర్చించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు.సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కూలీలకు ఉపాధి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్య, వైద్యం వంటి మౌలిక సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ప్రచారాలకు ప్రాధాన్యం ఇవ్వడం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అణచివేతకు పాల్పడకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని సీపీఐ నాయకులు హెచ్చరించారు.అనంతరం గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలను ఐక్యం చేసి భవిష్యత్‌లో చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. ప్రజలు తమ హక్కుల కోసం సంఘటితమై ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు దంతాల బాలరాజు, సీపీఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, గ్రామ కార్యదర్శి భూక్యా శ్రీనివాస్, సహాయ కార్యదర్శి జిల్లా వెంకన్న, భూక్య శ్రావణ్, నల్లగట్టు సామేలు, నల్లగట్టు, దారావత్ శ్రీను, రైతు సంఘం నాయకులు కొత్తపల్లి వెంకన్న,అన్నం వెంకటరెడ్డి, బండారు పుల్లారెడ్డి, సీపీఐ యువజన నాయకులు భూక్య విజయ్, భూక్య వినయ్, సైదులు, రాములు, నల్లగట్టు జనార్దన్,నల్లగట్టు శ్రీను పాల్గొన్నారు.

# ప్రపంచ చేనేత వస్త్ర పరిశ్రమల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ జివి

- చేనేత రంగానికి ప్రభుత్వాల ఆర్థిక బాసట అత్యవసరం

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**



ప్రపంచ చేనేత వస్త్ర పరిశ్రమల దినోత్సవం సందర్భంగా డాక్టర్ జివి చేనేత కార్మికులకు, వృత్తిదారుల కు, నేత న్నల కుటుంబాలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడు తూనా చిన్ననాటి జ్ఞాపకాలు – చేనేతతో నా అనుబంధం"మా తాత, నాయనమ్మ, మా నాన్న అందరూ నిరంతరం మగ్గాలు నేసేవారు.ఆ నేత సప్పుడు, నూలు పోగుల పరిమళం మధ్యే నేను పుట్టి పెరిగాను" అని డాక్టర్ జివి తన చిన్ననాటి జ్ఞాపకాలను భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. ఒక వస్త్రాన్ని మగ్గంపై తయారు చేయడం ఎంతటి క్లిష్టమైన, శ్రమతో కూడుకున్న ప్రక్రియ అనేది తాను స్వయంగా చూశానని చెప్పారు. చేనేత వస్త్రాల తయారీ వెనుక ఎంతో నిరంతర కృషి,అంకితభావం దాగి ఉన్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆర్థిక సాయం – రంగానికి పునరుజ్జీవంచేనేత పరిశ్రమ తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ప్రభుత్వాలు తక్షణమే స్పందించి తగిన ఆర్థిక సహాయాన్ని అందించాలని డాక్టర్ జివి పిలుపునిచ్చారు.చేనేత కార్మికులకు నూలు, రసాయనాలపై సబ్సిడీలను పెంచాలి.ఆధునిక మగ్గాలు, మౌలిక వసతుల కల్పనకు నేరుగా ఆర్థిక బాసట అందించాలి.చేనేత ఉత్పత్తులకు గిట్టుబాటు ధర దక్కేలా మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి.ఓర్పు, పట్టుదల, లాభనష్టాలను తట్టుకునే శక్తి"చేనేత పరిశ్రమను విజయవంతంగా నడపడం సామాన్యమైన విషయం కాదు. దీనికి అపారమైన పట్టుదల,ఆర్థిక స్థిరత్వం అవసరం. వ్యాపారంలో వచ్చే లాభనష్టాలను తట్టుకుని నిలబడే మానసిక ధైర్యం, ఆర్థిక శక్తి ఉన్నప్పుడే ఈ రంగంలో నేతన్నలు ముందుకు వెళ్లగలుగుతారు" అని ఆయన అభిప్రాయపడ్డారు.భారతీయ సంస్కృతికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే చేనేత కళను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని,ప్రజలందరూ చేనేత వస్త్రాలను ఆదరించాలని డాక్టర్ జివి విజ్ఞప్తి చేశారు.

# డ్రైనేజీ పనులను పరిశీలించిన చైర్మన్ మోహన్ నాయక్



**కల్లూరు ఆగస్టు 07 : ప్రజా జ్యోతి** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతు న్న డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ శుక్ర వా రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రాష్ట్ర రెవిన్యూ హౌ సింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ నిర్మాణంలో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా ప్రభుత్వ నిర్దేశితం ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు కాంటాక్ట్లకు సహించారు. ప్రజలకు మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ తొలి ప్రాధాన్యత అని మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ స్పష్టం చేశారు.

# 16వ వార్డులో మిషన్ శుభ్రత ప్రారంభం

**కల్లూరు ఆగస్టు 07 : ప్రజా జ్యోతి** కల్లూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 16వ వార్డులో శుక్రవారం మిషన్స్ శుభ్రత కార్యక్రమాన్ని వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు ప్రారంభించారు. శానిటరీ కార్మికులు సమిష్టిగా పాల్గొనే రహదారులు కాలువలు కూడా ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాంబాబు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే క్లీన్ కల్లూరు గ్రీన్ కల్లూరు లక్ష్యాన్ని సాధించవచ్చని తాడిపొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మిషన్ శుభ్రతను ప్రతి వార్డులో కార్యచరణ ప్రణాళిక ప్రకారం అమలు చేస్తున్నామని ప్రతి శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు పరిశుభ్రమైన కల్లూరు నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో శానిటరీ కార్మికుల పాల్గొన్నారు.

